

ఉద్యమకారులను ఆదుకోవాలి

కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే డిమాండ్‌తో తెలంగాణ ఉద్యమకారులు దీక్ష చేపట్టారు.

8లో



బంగారం ఉందంటూ టోకరా

ఇంట్లో బంగారం ఉందని.. పూజ చేస్తే తీసుకోవచ్చని నమ్మించిన ఇద్దరు వ్యక్తులు రూ.70వేలతో ఉడాయించారు.

8లో

గరిష్టం / కనిష్టం

30° / 25°

వాతావరణం

జిల్లా అంతటా మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆర్ అండ్ బీ ఈఈగా పవార్



బాధ్యతలు స్వీకరిస్తున్న పవార్

ఖమ్మం అర్బన్: ఖమ్మం ఆర్ అండ్ బీ ఈఈగా ఎం.పవార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈఈగా హైవే విభాగానికి చెందిన యుగంధర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమేరకు హైదరాబాద్ నుంచి పవార్‌ను బదిలీ చేయగా విధుల్లో చేరిన ఆయనకు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

బ్లడ్‌బ్యాంక్‌ల్లో నిబంధనలు విస్మరించొద్దు

ఖమ్మంవైద్యవిభాగం: బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశించారు. శాఖ ఉద్యోగులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా ఖమ్మంలోని పలు బ్లడ్ బ్యాంక్‌ల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, సిబ్బంది అర్హతలు, రక్తం నిల్వలను పరిశీలించాక నిర్వాహకులకు సూచనలు చేశారు. అయితే, విధుర బ్లడ్ బ్యాంకులో తనిఖీ సందర్భంగా రక్తపు నిల్వలు ఇంకో చోట ఉన్నట్లు గమనించి స్టాక్‌ను పరిశీలించారు. అలాగే, శాంపిల్స్‌ను ఐపీఎం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అసిస్టెంట్ డ్రగ్ కంట్రోల్ అధికారి అరవింద్, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అనిల్‌కుమార్, అశ్విని, డిప్యూటీ డీఎంహెచ్ఓ సైదులు, బ్లడ్ బ్యాంకు ప్రోగ్రాం అధికారి వెంకటరమణ, డిప్యూటీ డెమో జి.సాంబశివ రెడ్డి పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ఉత్పత్తిపై ఇంజనీర్లకు శిక్షణ

ఖమ్మంవ్యవసాయం: గృహాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించిన నేపథ్యాన ఎన్పీడీసీఎల్ ఇంజనీర్లకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని ఇంజనీర్లకు ఖమ్మంలో సోమవారం శిక్షణ మొదలుకాగా, ఇళ్లపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటు, విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథకంలో భాగంగా ప్లాంట్లు ఏర్పాటుచేయనుండగా ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ శిక్షణ ఇస్తున్నట్లు ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు బాబూరావు, రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అటు చెత్త.. ఇటు కంపు

సాక్షి ఫోకస్

వర్షాకాలంతో పాటే వచ్చే వ్యాధులతో జనం ఆందోళన చెందుతున్నారు. డ్రెయినేజీలు, రహదారుల వెంట ఎప్పటికప్పుడు చెత్త తరలించాల్సి ఉండగా.. ఆ దిశగా ప్రయత్నాలు పెద్దగా జరగడం లేదు. ఫలితంగా దోమలు విజృంభిస్తుండడంతో వ్యాధుల భయం జనాన్ని వెంటాడుతోంది. ఈ నేపథ్యాన ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీల్లో పరిస్థితులను 'సాక్షి' సోమవారం పరిశీలించగా పలు సమస్యలు వెలుగు చూశాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో దుర్గంధం

- రోడ్ల వెంట, డ్రెయినేజీల్లో శుభ్రం చేయడానికి రోజులు..
- పలుచోట్ల కానరాని పక్కా డ్రెయినేజీలు
- వర్షం వస్తే రోడ్లపై పారుతున్న మురుగు నీరు



టేకులపల్లి డబుల్ బెడ్‌రూం సముదాయం వద్ద డ్రెయినేజీ లేక నిలిచిన మురుగునీరు

విలీనం.. అధ్వానం

ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనమైన ప్రాంతాల్లో పారిశుధ్య లోపం కనిపిస్తోంది. ఖమ్మం కార్పొరేషన్‌లో ఖానాపురం హవేలీ గ్రామపంచాయతీ 2012లో విలీనమైంది. అయితే, ఇప్పటివరకు కూడా ఇక్కడ పారిశుధ్యం గాడిన పడలేదు. ఖానాపురం, టేకులపల్లి, లక్ష్మీనగర్, మహిళా ప్రాంగణం, శ్రీకృష్ణానగర్, గోశాల, డైట్ కళాశాల ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం జరిగి కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పలుచోట్ల డ్రెయినేజీలు లేవు. కేఎంసీ 7వ డివిజన్‌లోని టేకులపల్లిలో 2021 – 2022లో డబుల్ బెడ్‌రూం(కేసీఆర్ టవర్స్) గృహ సముదాయం నిర్మించారు. ఒక్కో బ్లాక్‌లో 24 ఇళ్ల చొప్పున 54 బ్లాక్‌లను నిర్మించి 1,296 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఇక్కడ సుమారు 4వేల మంది వరకు నివసిస్తుండగా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. కుడి వైపు బ్లాక్‌ల నుంచి మురుగునీరు వెళ్లేందుకు డ్రెయినేజీ నిర్మించినా, ఎడమ వైపు డబుల్ బెడ్‌రూం సముదాయం ముగింపు వద్దే డ్రెయినేజీ ఆపేశారు. దీంతో మురుగునీరంతా ఖాళీ స్థలాల్లో నిలిచి దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన చేయడంతో తాత్కాలికంగా ఇక్కడ ఇంకుడు గుంత తీశారే తప్ప డ్రెయినేజీ మాత్రం నిర్మించలేదు. మామూలు రోజుల్లో ఏమో కానీ చిన్న వర్షం వచ్చినా మురుగునీరు రహదారిపై చేరి మరింత ఇబ్బంది పడుతున్నారు. అలాగే, కాలనీవాసులు రోడ్డు పక్కనే వేస్తున్న చెత్తను పారిశుధ్య సిబ్బంది తొలగించకపోవడంతో పేరుకుపోతోంది.

వర్షం వస్తే ఇబ్బందే..



మురుగు నీరు వెళ్లడానికి డ్రెయినేజీ నిర్మాణానికి బదులు ఇంకుడు గుంతలు తీశారు. దీంతో అందులో నీరు నిలిచి మురుగు వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. సముదాయానికి ఓ పక్క డ్రెయినేజీ నిర్మించి ఇంకో పక్క వదిలేయడంతో ఈ సమస్యకు కారణమైంది.

– తుడుం రాములమ్మ, కేసీఆర్ టవర్స్, టేకులపల్లి

ప్రతిపాదనలకే పరిమితం



మా డివిజన్ నుంచి ఏటా రూ.7 కోట్ల ఆదాయం కేఎంసీకి వస్తున్నా కాలనీల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు లేవు. ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలవుతున్నాయి. ప్రజల కష్టాలు చూసైనా సమస్యలు పరిష్కరించాలి.

– దొంగల సత్యనారాయణ, కార్పొరేటర్, 7వ డివిజన్

వేచి ఉండాల్సిందే...



మరమ్మతులతో పక్కన పెట్టిన స్వచ్ఛ ఆటోలు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో వారానికోసారి, ఇంకొన్ని ప్రాంతాల్లో 15 రోజులకోసారి కూడా ఇంటింటా చెత్త సేకరించడం లేదు. చెత్త సేకరణకు ఉన్న 12 వాహనాల్లో నాలుగు ఆటోలు మూలనపడ్డాయి. టీచర్స్ కాలనీ, ఆర్సీఎం చర్చ్, ముస్లిం కాలనీ, యాదవ బజార్ తదితర ప్రాంతాల్లో వారం, పది రోజులకోసారి చెత్త సేకరిస్తుండగా వాహనాల మరమ్మతుతో మరింత జాప్యం జరుగుతోంది. ఇటీవల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనుల్లో భాగంగా అనేక చోట్ల రోడ్లను తవ్వడంతో చెత్త సేకరణ వాహనాలు అటువైపే వెళ్లడం లేదు. ఫలితంగా రోజుల తరబడి చెత్త ఇళ్లలో ఉంచాల్సి రావడంతో ఈగలు, దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అప్పుడప్పుడు సేకరించే చెత్తను సైతం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నివాసం నుంచి ఎంప్లాయిస్ కాలనీకి వెళ్లే బైపాస్ రోడ్డుకు ఇరువైపులా వేస్తుండడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారు దుర్గంధంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే, సేవాసదనం రోడ్డు, కేజేఆర్ కాంప్లెక్స్ వెనుక, నారాయణ స్కూల్ సమీపాన, బంజారా కాలనీలో చెత్త వేస్తూ అనధికారిక డంపింగ్ యార్డులుగా మార్చారు.

ఫిర్యాదు చేసినా పట్టింపు కరువు



ఎంప్లాయిస్ కాలనీ రోడ్డులో చెత్త వేస్తున్నారని, సొసైటీ సమీపాన వీధిలైట్లు రావడం లేదని కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నందున రెండు, మూడు రోజులకోసారైనా చెత్త సేకరించేలా చూడాలి.

– పోతినేని రమాదేవి, మధిర

డ్రెయిన్లు పొంగి రహదారిపైకి..



12వ వార్డులో రోడ్ల వెంట పెరిగిన పిచ్చిమొక్కలు

వైరా: ఓ వైపు వర్షాలు కురుస్తుండగా డ్రెయిన్లలో చెత్తాచెదారం తొలగించకపోవడం, చాలా ప్రాంతాల్లో డ్రెయిన్లు లేకపోవడంతో రహదారులపైకి మురుగునీరు చేరుతోంది. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సత్రం బజార్ లోతట్టు ప్రాంతంలో ఉండడంతో అటు వర్షపు నీరు, ఇటు ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరంతా ముందుకు వెళ్లే మార్గం లేక రోడ్లపై ప్రవహిస్తోంది. కనీసం నెలకొకసారి కూడా డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. అలాగే, చాలాచోట్ల రహదారులను ఆనుకుని పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించకపోవడంతో దోమలు పెరిగి వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నా ఫాగింగ్ చేయడం లేదని వాపోతున్నారు. మున్సిపాలిటీ జనాభాకు అనుగుణంగా చెత్త తరలించే వాహనాలు లేకపోవడం, ఉన్నవి మరమ్మతుకు రావడంతో ఈపరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

మావార్డును పట్టించుకోవడం లేదు..



మా ప్రాంతం లోతట్టు కావడంతో వరద ఇళ్లలోకి చేరుతోంది. అలాగే, మున్సిపాలిటీ వాహనాలు రాక చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు పెరుగుతున్నాయి. అయినా ఫాగింగ్ చేయడంలేదు అధికారులు మా వార్డులో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయి.

– ఆర్.తిరుపతమ్మ, 12వ వార్డు, వైరా

మూడు రోజులు ఆగితేనే..



జవహర్‌నగర్‌లో డ్రెయినేజీ లేక నిలిచిన మురుగునీరు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. స్థానిక జవహర్‌నగర్‌లో పరిశీలించగా చెత్త సేకరణ రెండురోజులకోసారి జరుగుతోందని స్థానికులు తెలిపారు. ఇక డ్రెయినేజీల్లో మురుగు, చెత్త తీసి రోడ్డుపై వేసి మూడురోజుల తర్వాతే తీసుకెళ్తున్నారని చెప్పారు. జవహర్‌నగర్‌లో సీసీ రోడ్లు ఉన్నా చాలా వీధుల్లో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మరికొన్ని చోట్ల మురుగునీరు ఇంటి ఆవరణలోకి చేరుతోందని కాలనీ వాసులు తెలిపారు.

డ్రెయినేజీలు లేకపోవడంతో...



జవహర్‌నగర్ కాలనీలో డ్రెయినేజీలు నిర్మిస్తే మురుగుకు ఇబ్బంది ఉండదు. కచ్చా డ్రెయిన్ల కారణంగా ఎక్కడి నీళ్లు అక్కడే నిలిచిపోతూ దుర్వాసన వస్తుంది. మురుగునీరు రోడ్డుపై నిలుస్తుండడంతో చాలాచోట్ల సీసీ రోడ్డు దెబ్బ తింటున్నాయి.

–చేపలమడుగు నాగరాజు, జవహర్‌నగర్, సత్తుపల్లి

వారానికోసారే చెత్త సేకరణ



బొడ్రాయి సెంటర్ వీధిలో డ్రెయినేజీ నుంచి తీసి పక్కన వేసిన చెత్త

ఖమ్మంరూరల్: ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో చెత్త సమస్యకు సరైన పరిష్కారం లభించడం లేదు. అధికారులు, సిబ్బంది సరిపడా లేక పర్యవేక్షణ లోపించడంతో డ్రెయినేజీల్లో మురుగునీరు, వీధుల్లో చెత్త తరలింపుపై పర్యవేక్షణ లోపిస్తోంది. వారానికి ఒకసారే డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్నా, ఆ మురుగును తరలించకపోవడంతో రహదారులపై రాకపోకలకు జనం ఇబ్బంది పడుతున్నారు. పెదతండాలోని బొడ్రాయి వీధి జలగంనగర్‌లో పరిశీలించగా దాదాపు అన్ని వీధుల్లోని డ్రెయినేజీలు మురుగు నిండి కనిపించాయి. ఇక ఇంటింటా చెత్త సేకరణకు సిబ్బంది వారం, పదిహేను రోజులకోసారి వస్తున్నారని స్థానికులు తెలిపారు. ఒకవేళ చెత్త సేకరించినా ఖాళీ స్థలాల్లో వేస్తున్నారని వాపోయారు.

ఎక్కడి చెత్త అక్కడే



రోజు విడిచి రోజు చెత్త తీస్తే శుభ్రంగా ఉంటుంది. కానీ సిబ్బంది వారానికోసారి తీసుకెళ్తుండగా, కాల్వలో తీసిన మురుగు అక్కడే వేస్తున్నారు. వారాల తరబడి తరలించక దుర్వాసన వస్తోంది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్త మా సమీపంలోనే వేస్తున్నారు.

– పి.వీరస్వామి, బొడ్రాయి వీధి, పెదతండా

ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు వేళాయె...

- ఇప్పటికే మొదలైన స్లాట్ బుకింగ్
- నేటి నుంచి మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలన



కౌన్సెలింగ్ జరగనున్న ఎస్ఆర్, బీజీఎన్ఆర్ కాలేజీ

ఖమ్మంసహకారనగర్: ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు కౌన్సెలింగ్ మంగళవారం మొదలుకానుంది. జూన్ 28వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభం కాగా.. మంగళవారం నుంచి 8వ తేదీ వరకు మొదటి విడత సర్టిఫికెట్ల పరిశీలన చేపడతారు. ఇందుకోసం ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా విద్యార్థులు ఇక్కడి ఎనిమిది ఇంజనీరింగ్ కళాశాలలతో రాష్ట్రంలోని ఏ కళాశాలనైనా వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంచుకునే అవకాశం ఉంది. స్లాట్ బుకింగ్, ఇతర వివరాలు http:// tgeapcet.nic.in వెబ్‌సైట్‌లో చూడొచ్చని, లేదా కౌన్సెలింగ్ కేంద్రాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈసారి 'మాక్ అలాట్‌మెంట్'

జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ మాదిరిగానే ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు సైతం వెబ్ ఆప్షన్ పెట్టుకున్నాక ఈసారి నుంచి కొత్తగా మాక్ సీటు అలాట్‌మెంట్ ఇస్తారు. తద్వారా విద్యార్థులకు వారి ర్యాంక్, ఎంచుకున్న కోర్సు ఆధారంగా సీటు ఏ కాలేజీలో వస్తుందో అంచనా వేసుకోవచ్చు. ఆపై ఆప్షన్లు మార్చుకునే అవకాశం కల్పించి సీటు ఫ్రీజ్ చేస్తారు. కాగా, మూడు దశల కౌన్సెలింగ్‌లో సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేశాక మార్చుకునేందుకు ఆగస్టు 16, 17వ తేదీల్లో అవకాశం కల్పించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లు వెంట తీసుకెళ్లాలి. టీజీఎప్‌సెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఇంటర్మీడియట్ టీసీ, 01-04-2025 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, స్లాట్ బుక్ చేసుకున్న రశీదు చూపించాల్సి ఉంటుంది. అలాగే, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 2025-26వ సంవత్సరానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలి.

మొదటి విడత కౌన్సెలింగ్ ఇలా...

ఈనెల 7వ తేదీ వరకు స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఉంది. మంగళవారం నుంచి 8వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనుండగా, 6నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకోవచ్చు. వీరికి 13న మాక్ సీట్ల అలాట్‌మెంట్ చేసి 14, 15వ తేదీల్లో వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పిస్తారు. చివరగా జూలై 15 తేదీన సీట్ల కేటాయించనుండగా, జూలై 18నుంచి 22వ తేదీ వరకు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ వస్తుంది. దీన్ని ఇతరులకు చెప్పకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కళాశాలలు, కోర్సులు ఎంపిక సమయాన అప్రమత్తంగా ఉండాలి. మాక్ అలాట్‌మెంట్ ద్వారా ఓ అంచనాకు రావొచ్చు. ఈనెల 18న మొదటి విడత సీట్ల కేటాయింపు జరుగుతుంది.

– చంద్ర సుధాకర్, కో ఆర్డినేటర్, ఎప్‌సెట్ హెల్ప్‌లైన్ సెంటర్

రోడ్డు ప్రమాదాలను అరికట్టేలా కార్యాచరణ

నేర సమీక్ష సమావేశంలో సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో అరికట్టేలా కార్యాచరణ రూపొందించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఖమ్మంలో సోమవారం జరిగిన నేరసమీక్ష సమావేశంలో ఆయన స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, దర్యాప్తుపై ఆరాతీశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ వైరా, కల్లూరు డివిజన్ల పరిధిలో గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, బ్లింకింగ్ లైట్ల ఏర్పాటుతో ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే, మితిమీరిన వేగం, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిని గుర్తించేలా నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. కాగా, అమాయక ప్రజలు అవసరాలను ఆసరాగా చేసుకుని చీటీలు నడిపే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే, దొంగతనాల నివారణ, గంజాయి సరఫరా, అమ్మకాలు జరగకుండా బందోబస్తు పెంచాలని సీపీ ఆదేశించారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రఘు, రవి, సర్వర్, సుశీల్‌సింగ్, నర్సయ్య పాల్గొన్నారు. కాగా, జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన వారిని సీపీ సన్మానించారు, ఏఆర్ ఏసీపీలు సుశీల్‌సింగ్, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, సురేష్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

'గ్రీవెన్స్ డే'లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వినతిపత్రం ఇచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కారం చూపాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి(గ్రీవెన్స్‌డే)లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసిఆయన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ప్రజావాణిని అధికారులు అత్యంత ప్రాధాన్యతగా భావించి హాజరుకావాలని సూచించారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని, ఏదైనా పరిష్కరించలేకపోతే అందుకు కారణాలను దరఖాస్తుదారులకు తెలపాలని చెప్పారు. అయితే, దరఖాస్తుల పరిష్కారంలో మానవీయకోణంతో పనిచేయాలని తెలిపారు. డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన 22మంది అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ అనుదీప్ సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడిన కలెక్టర్.. విధినిర్వహణలో అనుభవాలను ప్రస్తుత ఉద్యోగులతో పంచుకోవాలని సూచించారు. కాగా, చైన్‌మెన్‌గా విధుల్లో చేరి చింతకాని తహసీల్దార్‌గా రిటైర్డ్ అవుతున్న కె.అనంతరాజు, డీటీ సీహెచ్.సత్యనారాయణ తదితరులు తమ అనుభవాలను వివరించారు.

భూనిర్వాసితులకు అండగా నిలుస్తాం..



భూ నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న అజయ్‌కుమార్

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న వారికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. భూనిర్వాసితులు పలువురు ఆయనను సోమ వారం ఖమ్మంలో కలిశారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. మున్నేటి వరదతో ఇబ్బందులు ఎదురుకాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తాను రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదలకు పనికిరాని భూములు అంటగట్టే యత్నం చేస్తోందని ఆరోపించారు. ఈమేరకు తగిన పరిహారం చెల్లింపు, ప్లాట్ల కేటాయింపులో ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే అడ్డుకుంటామని పువ్వాడ తెలిపారు.

తిరుమలాయపాలెంలో ఏటీసీ

భవన నిర్మాణాలకు రూ.45 కోట్లు మంజూరు

తిరుమలాయపాలెం: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేలా పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే పలుచోట్ల ఉన్న ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలోనే పాలేరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో కొత్తగా తిరుమలాయపాలెంకు ఏటీసీని మంజూరు చేయడంతోపాటు భవన నిర్మాణాలకు రూ.45.15 కోట్లు కేటాయించింది. ఈ మేరకు స్థానిక కేజీబీవీ ఎదురుగా ఉన్న గ్రామకంఠం భూమిని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఏటీసీ ఏర్పాటుతో నియోజకవర్గంలోని యువతకు సాంకేతిక విద్య చేరువై ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

హైవే పక్కనే నిర్మిస్తేనే మేలు

తిరుమలాయపాలెంకు ఏటీసీ మంజూరైన నేపథ్యాన హైవే పక్కన సర్వే నంబర్ 254లో భవనాలు నిర్మించాలని అఖిలపక్షం నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ యువతకు లబ్ధి జరిగేలా ఏటీసీ మంజూరు చేయించడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భవనాలను ఊరికి దూరంగా కాకుండా హైవే పక్కన నిర్మిస్తే అందరికీ మేలు జరుగుతుందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ఎన్నబోయిన రమేష్, కొమ్ము పూలే, గంట కృష్ణ, అశోక్, బాబు, రాంబాబు, వంగూరి మధు, రామకృష్ణ, తిమ్మిడి హన్మంతరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శ్రేయస్సు కోసం పాటుపడిన కోటిరెడ్డి..



కోటిరెడ్డితో కుటుంబ సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా సింగరేణి ఉద్యోగి, ఐఎన్టీయూసీ నాయకుడు కళ్లం కోటిరెడ్డి నిరంతరం సంస్థ అభివృద్ధితో పాటు కార్మిక శ్రేయస్సు కోసం పాటుపడ్డారని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన కోటిరెడ్డిని ఇల్లెందు జేకే ఓసీలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ హక్కుల సాధనకు కోటిరెడ్డి చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు జాకీర్ హుస్సేన్, చిన్నయ్య, నాయకులు లచ్చిరామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేకే సీఈఆర్ క్లబ్‌లో కూడా సన్మానించగా మున్సిపల్ మాజీ చైర్మన్ మడత రమా వెంకట్‌గౌడ్ మాట్లాడారు. అనంతరం కోటిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమం, సింగరేణి అభివృద్ధికి పాటుపడ్డానని తెలిపారు. ఎమ్మెల్యే కనకయ్య, మడత వెంకట్ సారథ్యాన రాజకీయ ప్రస్థానం ప్రారంభిస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావుతో పాటు నాయకులు, కోటిరెడ్డి కుటుంబ సభ్యులు కళ్లం అమరనాథ్, శాలినీరెడ్డి, మురళీరెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి..

ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోతే ఆందోళనలు



దీక్షలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఎదుట చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఉద్యమకారుడు అర్వపల్లి విద్యాసాగర్, సీపీఐ నాయకుడు సింగు నరసింహారావుతో కలిసి ఆయన ప్రారంభించాక మాట్లాడారు. ప్రతీ ఉద్యమకారుడికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు, అమరవీరుల కుటుంబాలకు రూ.25వేలు ఇస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షకు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఇటిక్యాల రామకృష్ణ సంఘీభావం తెలపగా, సాయంత్రం పొలిటికల్ జేఏసీ మాజీ కన్వీనర్ కూరపాటి రంగరాజు విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్యతో పాటు అర్వపల్లి విద్యాసాగర్, పద్మాచారి, వెంకటేశ్వరావు, శేషగిరి, సతీష్, మట్టా దుర్గాప్రసాద్‌రెడ్డి, జ్వాల నరసింహారావు, షేక్ అబ్బాస్, రజనీకాంత్, ఎస్.డీ.బురాన్, ఆసిఫ్, నాగుల్‌మీరా, శ్రీనివాస్ నాయక్, పాలకుర్తి కృష్ణ, రాజేందర్‌నాయక్, విజయ్‌కుమార్, ఉమాయాదవ్, వరలక్ష్మి, ధనలక్ష్మి, రమాదేవి తదితరులతో పాటు పెద్దసంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఈదురుగాలి, వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలితో కూడిన వర్షం కురిసింది. రాత్రి 8గంటల తర్వాత మొదలైన ఈదురుగాలులతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఖమ్మం ఖానాపురంలోని 132 కేవీ ప్రధాన సబ్ స్టేషన్‌లో సమస్య తలెత్తగా నగర వ్యాప్తంగా సరఫరా నిలిచిపోయింది. వర్షం కారణంగా సమస్యను పరిష్కరించడంలో జాప్యం జరగడంతో రాత్రి పొద్దుపోయే వరకు కూడా సరఫరా పునరుద్ధరించలేకపోయారు. కాగా, జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి, సోమవారం కురిసిన వర్షం పంటల సాగు పనులకు ఉపకరించనుంది.

‘బెస్ట్ అవైలబుల్’ బకాయిలు విడుదల చేయాలి



ధర్నాలో నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

ఖమ్మం మామిళ్లగూడెం: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్, బెస్ట్ అవైలబుల్ పేరెంట్స్ అసోసియేషన్ బాధ్యుడు గురుస్వామి డిమాండ్ ఈమేరకు బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా వెంకటేష్, గురుస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 237ప్రైవేట్ పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ద్వారా 25వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతుండగా, రూ.200కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ఫలితంగా పాఠశాలల యజమాన్యాలు పిల్లలను ఇబ్బంది పెడుతున్న నేపథ్యాన ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు, విద్యార్థుల తల్లిండ్రులు ప్రసాద్, స్టాలిన్, అశోక్, గోపి, బాలు, సతీష్, నాని, సునీల్, నవీన్, ప్రవీణ్, నాగరాజు, వీరబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఉద్యోగి మృతి



సత్యనారాయణ (ఫైల్)

వైరా: నేలకొండపల్లి మండలం చెన్నారం పీఏసీఎస్ సీఈఓ ఎస్.వీ.సత్యనారాయణ(58) ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన స్వగ్రామం ఏపీలోని కూనవరం కాగా నేలకొండపల్లిలో స్థిరపడ్డాడు. కాగా, సత్యనారాయణ సోమవారం కూనవరం బయలుదేరాడు. ఖమ్మం నుంచి భద్రాచలానికి డీలక్స్ బస్సులో వెళ్తుండగా వైరా వద్ద నొప్పి వస్తోందని పక్కనే ఉన్న ప్రయాణికుడికి చెబుతూ సీటులోనే కుప్పకూలాడు. దీంతో బస్సును పోలీస్‌స్టేషన్ సమీపాన నిలిపి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వచ్చిన సిబ్బంది, కానిస్టేబుల్ ఘనీ పాషా సాయంతో సత్యనారాయణకు సీపీఆర్ చేసినా ఫలితం దక్కలేదు. దీంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని ఎస్సై పి.రామారావు తెలిపారు.

ఉద్యోగులను బలి తీసుకున్న ప్రమాదం

వ్యాన్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి



రాజేష్ (ఫైల్)



రఘుపతి (ఫైల్)

ఏన్కూరు: రోజు మాదిరిగానే విధులకు వెళ్తున్న ఇద్దరు ఉద్యోగులను రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకుంది. ఉద్యోగాలకు వెళ్తున్నట్లు కుటుంబీకులకు చెప్పి బయలుదేరగా.. కాసేపటికే ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం అందడంతో విషాదం అలుముకుంది. ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌లో సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కొణిజర్ల మండల పల్లిపాడుకు చెందిన ఇమ్మడి రఘుపతి(51) కొత్తగూడెంలో హోంగార్డుగా, భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం అంకపాలెంకు చెందిన బత్తుల రాజేష్(30) ఖమ్మంలో ఉంటూ కొత్తగూడెం ఎంఈఓ కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ద్విచక్ర వాహనంపై రాజేష్ కొత్తగూడెం వెళ్తుండగా పల్లిపాడు వద్ద రఘుపతి లిఫ్ట్ అడిగి ఆయనతోపాటు బయలుదేరాడు. మార్గమధ్యలో ఏన్కూరు మండలం హిమామ్‌నగర్ సమీపాన వీరి బైక్‌ను జూలూరుపాడు నుండి ఏన్కూరు వైపు వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజేష్, రఘుపతికి తీవ్ర గాయాలు కాగా, 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

బస్సులో వెళ్లినా బతికేవాడేమో...

కొత్తగూడెంలో హోంగార్డుగా పనిచేసే రఘుపతికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అలాగే, రాజేష్‌కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. రఘుపతి ప్రతీరోజు పల్లిపాడు నుంచి బస్సులో కొత్తగూడెం వెళ్లివచ్చేవాడు. అయితే, సోమవారం విధులకు ఆలస్యమవుతుండడంతో పల్లిపాడు వద్ద రాజేష్‌ను లిఫ్ట్ అడిగి ఆయన బైక్‌పై బయలుదేరాడు. దీంతో గమ్యం చేరకుండానే మార్గమధ్యలో ప్రమాదం బారినపడ్డాడు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏన్కూరు ఎస్‌ఐ రఫీ తెలిపారు.

రైల్వే ఎస్సై భార్య బలవన్మరణం

- ఎస్సై సహా కుటుంబీకుల వేధింపులే కారణమని ఆరోపణ
- ఆస్పత్రి మార్చురీ వద్ద భర్త తండ్రికి దేహశుద్ధి



భర్త రాణాప్రతాప్, కుమార్తెతో రాజేశ్వరి (ఫైల్)



మార్చురీ వద్ద రాణాప్రతాప్ తండ్రిపై దాడిని అడ్డుకుంటున్న పోలీసులు

జూలూరుపాడు/ఖమ్మం క్రైం: భర్త పోలీసు శాఖలో ఎస్సై, బావ కూడా అదే ఉద్యోగం.. మామ సైతం రిటైర్డ్ పోలీసు అధికారి. సమాజంలో ప్రజల కష్టాలు తీర్చే ఉద్యోగుల ఇంటికి కుమార్తెను ఇస్తే బిడ్డ జీవితం బాగుంటుందని భావిస్తే వివాహేతర సంబంధాల పేరిటే కాక రకరకాల కారణాలతో వేధిస్తుండడంతో ఆమె తనువు చాలించింది.

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రాములుతండాకు చెందిన బానోతు రాణాప్రతాప్‌తో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరానికి చెందిన రాజేశ్వరి(34)కి 2018లో వివాహం జరిగింది. ఆ సమయాన రూ.40 లక్షలతో పాటు, 35 తులాల బంగారం, మరో రూ.4లక్షల విలువైన కానుకలను ఆమె తల్లిదండ్రులు ముట్టజెప్పారు. వీరికి ప్రస్తుతం ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉండగా.. కొన్నాళ్ల నుంచి భర్తతో పాటు అత్తామామలు పుష్పరాణి – చంద్రం, బావ మహేష్ (ఎస్సై, మహబూబాబాద్ వీఆర్) రాజేశ్వరికి వివాహేతర సంబంధం అంటగట్టి వేధిస్తున్నట్లు సమాచారం. కాగా, రాణాప్రతాప్‌కు ఖమ్మం జీఆర్పీ ఎస్సైగా పోస్టింగ్ రావడంతో భార్యాపిల్లలను జూలూరుపాడులోనే ఉంచి రాకపోకలు సాగిస్తున్నాడు. అయితే, కుటుంబీకుల వేధింపులు తాళలేక రాజేశ్వరి జూలూరుపాడులోని అద్దె ఇంట్లో జూన్ 25న పురుగుల మందు తాగగా ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం, ఆపై హైదరాబాద్ తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందింది.

మామపై దాడి..

హైదరాబాద్ నుంచి రాజేశ్వరి మృతదేహాన్ని సోమవారం ఉదయం ఖమ్మం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈక్రమాన రాణాప్రతాప్ తండ్రి చంద్రయ్య మార్చురీ వద్దకు రావడంతో తమ బిడ్డ మృతికి కారణమని ఆరోపిస్తూ రాజేశ్వరి కుటుంబీకులు దాడి చేశారు. దీంతో జూలూరుపాడు, ఖమ్మం టూటౌన్ పోలీసులు అడ్డుకుని ఆయనను టూటౌన్‌కు తరలించారు. ఘటనపై మృతురాలు తండ్రి సోమ్లా ఫిర్యాదుతో రాణాప్రతాప్, పుష్పరాణి, చంద్రం, మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు జూలూరుపాడు ఎస్‌ఐ రవి తెలిపారు. కాగా, రాణాప్రతాప్, ఆయన సోదరుడు మహేష్ మొదటి నుంచీ వివాదాస్పదులుగానే ఉన్నారు. ఖమ్మం పాత బస్టాండ్ సమీపాన ఓ చెప్పుల షాపు యజమానిపై కొన్నాళ్ల క్రితం అకారణంగా దాడి చేసిన రాణాప్రతాప్ తుపాకీతో బెదిరించాడు. ప్రస్తుతం ఆయన భార్య ఆత్మహత్య చేసుకోవడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

ఇంట్లో బంగారం ఉందంటూ టోకరా

రూ.70వేలు తీసుకుని రాగి చెంబులో గులకరాళ్లు పెట్టి మాయం

నేలకొండపల్లి: దంపతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ మోసగాడు వారి ఇంట్లో బంగారం ఉందని పూజలు చేస్తే వెలికితీయొచ్చని నమ్మించి రూ.70వేలు తీసుకుని మోసం చేసిన ఘటన ఇది. నేలకొండపల్లి మండలంలోని ఓ గ్రామానికి దంపతులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. ఇటీవల గ్రామానికి వచ్చిన ఇద్దరు తమకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని పరిచయం చేసుకున్నారు. సదరు దంపతుల ఇంట్లో భారీగా బంగారం ఉందని, వెలికితీయాలంటే పూజలు చేయాలని నమ్మించారు. అందుకు రూ.70వేలు ఖర్చవుతుందని చెప్పగా అంత డబ్బు లేదనడంతో ధనవంతులయ్యే మార్గం కోల్పోతున్నారని హడావుడి చేశారు. దీంతో సదరు దంపతులు అందినకాడికల్లా అప్పులు తెచ్చి అప్పగించారు. ఆపై దంపతులతోనే ఇంట్లో గొయ్యి తవ్వించి లైట్లు బంద్ చేయించారు. అనంతరం రెండు రాగి చెంబులను గుంతలో పెట్టి వారం తర్వాత తీస్తే బంగారం ఉంటుందని చెప్పి వెళ్లిపోయారు. ఈమేరకు బాధితులు ఇటీవల రాగి చెంబులను పరిశీలించగా గులకరాళ్లు కనిపించాయి. దీంతో సదరు వ్యక్తులు ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పినా ఆపై స్పందన లేకపోవడంతో మోసపోయామని గుర్తించిన దంపతులు లబోదిబోమంటున్నారు.

మనస్తాపంతో దివ్యాంగుడి ఆత్మహత్య

రఘునాథపాలెం: వివాహం జరగడం లేదనే మనస్తాపంతో ఓ దివ్యాంగుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కోటపాడుకు చెందిన దివ్యాంగుడు జాల మధు(35) తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందారు. అయితే, ఆయనకు పెళ్లికావడం లేదనే బాధతో ఆదివారం పురుగుల మందు తాగగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

అనుమానాస్పద మృతిలో వ్యక్తి మృతి

కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్‌కు చెందిన ఆలకుంట బాబు(48) ఆదివారం ఖమ్మం భూదాన్ కాలనీలోని తన కుమార్తె శివరాత్రి తిరుపతమ్మ ఇంటికి వచ్చాడు. తిరిగి ఖమ్మం వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరిన ఆయన తిరిగి రాలేదు. సోమవారం ఉదయం ఖమ్మం–వైరా ప్రధాన రహదారి పక్కన బాబు మృతదేహం కనిపించడం, ఆయన తలపై గాయం ఉండడంతో తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ పేరిట మెడికల్ షాపుల్లో వసూళ్లు

చింతకాని: టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులుగా చెప్పుకున్న వ్యక్తులు మెడికల్ షాపుల నుంచి నగదు వసూలు చేసిన ఘటన ఇది. ముగ్గురు వ్యక్తులు శనివారం కారులో చింతకానిలోని శ్రీ విజయ సాయి మెడికల్ షాప్ వద్దకు శనివారం వచ్చారు. వరంగల్ నుంచి వస్తున్న తాము వైద్య, ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులమని చెబుతూ నకిలీ మందులు అమ్ముతున్నట్లు సమాచారం ఉన్నందున రూ.10 వేలు డిమాండ్ చేయగా రూ.3 వేలు ఇచ్చాడు. ఆపై శ్రీ శ్రీనివాస మెడికల్ షాపులోనూ రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.10 వేలు ఇచ్చారు. అయితే, వారు నకిలీ ఉద్యోగులని తెలియడంతో షాపుల యజమానులు సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. కాగా, నిందితుల్లో ఒకరు ఖమ్మంలో గ్రామీణ వైద్యుడిగా చెలామణి అవుతున్న మద్దెల స్వరూప్‌గా గుర్తించినట్లు వెల్లడించారు.